



ఆంధ్ర భద్రాద్రిలో వైభవంగా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి.. కె.గంగవరం మండలం సత్యవాడలో వేడుకలకు మంత్రి సుభాష్ హాజరయ్యారు.. పెదపూడి మండలం గొల్లలమామిడాడలో జరిగిన వేడుకలకు ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున క్యూకట్టారు.. సీతారాముల కల్యాణం కన్నుల పండువగా సాగింది. స్వామి అమ్మవార్లకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ దంపతులు, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. -7లో



జి.మామిడాడలో సీతారాములకు సమర్పించేందుకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ దంపతులు, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు



అన్నవరంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న రుత్విక్‌లు



కాకినాడ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ లైన్‌లో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న ఎస్పీ దంపతులు



పిఠాపురం మండలం చేబ్రోలులో సీతారాముల కల్యాణోత్సవం

సీసీ.. చూసీ!



గత నెల 24న జరిగిన పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి ఎన్నో సంచనాలకు వేదికైంది.. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది..ఆ ఘటనకు సీసీ కెమెరాలే దాదాపుగా చెక్ పెట్టాయి.ఆయన అదే రోజు హైదరాబా ద్ నుంచి బుల్లెట్‌పై సుమారు 400 కిలోమీటర్లు పైనే ప్రయాణించారు. ఆ ఘటనపై క్రైస్తవులంతా ఏకమయ్యారు. పాస్టర్‌ను హత్య చేశారంటూ గొంతెత్తారు.. ఎవరికి వారు రకరకాల వాదనలు వినిపించారు. పోలీసులు దర్యాప్తు ఆరంభించారు.. సీసీ అస్త్రం బయటకు తీశారు.. ఆయన ప్రయాణించిన దారిలో సుమారు 300 సీసీ కెమెరాలు పరిశీలించారు.. ఏం జరిగిందో చెప్పడానికి ప్రయత్నించారు. అల్లర్లను చల్లార్చారు. అసలు సీసీ కెమెరాలే లేకపోతే దర్యాప్తు ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడని పరిస్థితి ఉండేది. నిఘా నేత్రాల వల్ల ఆ కేసులో దాదాపుగా చిక్కుముళ్ల వీడినట్టు సమాచారం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సీసీ కెమెరాల ఏర్పాటులో ఇటు యంత్రాంగం, అటు జనంలోనూ అలసత్వం కనబడు తోంది. సర్కారు వారి కెమెరాలను రకరకాల దోషాలు పట్టిపీడిస్తుంటే.. ప్రజలు వాటిని ఏర్పాటు చేసుకోవడంపై విముఖత చూపుతున్నారు.



చిల్లకల్లు వద్ద రోడ్డుపై పడిపోయిన ప్రవీణ్ (ఫైల్)

(రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ/క్రైం-ఆంధ్రజ్యోతి)

సవాలక్ష సమస్యల పరిష్కారంలో కీలక భూమిక వహిస్తున్నది 'నిఘా' నేత్రమే. నేరాల దర్యాప్తు, నియంత్రణలో మూడో కన్ను అత్యంత కీలకంగా మారింది.అధిక దర్యాప్తులు సీసీ కెమెరాల ఆధారంగానే ఓ కొలిక్కి వస్తున్నాయి. పలు కీలకమైన కేసుల్లో సీసీ కెమెరాల ఫుటేజీలు లభ్యత వల్ల ఏళ్ల పాటు సాగాల్సిన దర్యాప్తులు వేగంగా జరిగి నేరస్తులను జైలుకు పంపిస్తున్నాయి. నేర నియంత్రణలో సీసీ కెమెరా ఫుటేజీలు కీలకంగా ఉన్నా ఏర్పాటులో కరువు కనబడుతోంది.తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో కనీసం 5 వేల కుపైనే సీసీ కెమెరాలు ఉండాలి. మరో రెండేళ్లలో పుష్కరాలు రానున్నాయి.కానీ ప్రస్తుతం 375 కెమెరాలు ఉండగా..కేవలం 185 పనిచేస్తున్నాయి. అధికారికంగా 480 కెమెరాలు ఉన్నాయని లెక్క చెబుతున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 150 సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిలో 15 కెమెరాలు సాంకేతిక ఇబ్బందుల వల్ల పనిచేయడం లేదు. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌లో 10 మంది సిబ్బంది షిఫ్టుల వారీగా పనిచేస్తూ ఈ కెమెరాల ఫుటేజీని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నగరంలో ప్రస్తుతం 320 సర్కారు కెమెరాలు మాత్రమే విధుల్లో ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని పోలీసు యంత్రాంగం ఎన్నో కీలకమైన కేసులను ఛేదించింది. కోనసీమ జిల్లా పరిధిలో పోలీసుల రికార్డుల ప్రకారం 2వేలకు పైనే సీసీ కెమెరాలు ఉన్నాయి. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 3,622 సీసీ, సిటిజెడ్ కెమెరాలు ఉన్నాయి. జిల్లా పోలీస్‌శాఖకు సంబంధించి 540 సీసీ, సిటిజెడ్ కెమెరాలుండగా పోలీస్‌శాఖ 16 డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసింది. ఈ కెమెరాలు నిరంతచాయం పని చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 10 వేల సీసీ కెమెరాలు ఏర్పా టు చేస్తే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావు లేకుండా జిల్లాలో ప్రశాంతమైన వాతావరణాన్ని రూపొందించవచ్చని ఎస్పీ బింధుమాధవ్ ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా సంఘటన జరిగిన సమయంలో ప్రైవేటు కెమెరాలపై ఆధారపడాల్సి వస్తోంది.శివారు, సమ స్యాత్మక ప్రాంతాల్లో నిఘానేత్రాలు మసక బారిపోయాయి.

పోలీస్ కెమెరాలకు మ్యాట్రిక్స్

పోలీస్ సీసీ కెమెరాలను మ్యాట్రిక్స్ సంస్థకు అప్పగించారు. కెమెరాల ఏర్పాటు, పర్యవేక్షణ, మరమ్మతులు ఆ సంస్థ చూడాల్సి ఉంది. కానీ ఆ సంస్థ అలసత్వం వల్ల కెమెరాల పని తీరు రోజు రోజుకూ మందగిస్తోందని చెబుతున్నారు. మ్యాట్రిక్స్ సంస్థకు విజయవాడలో సర్వర్ ఉంది. సీసీ ఫుటేజీ 3 రోజుల వరకూ జిల్లా పోలీసు కార్యాలయంలో నిక్షిప్తమై ఉంటుంది.తర్వాత 28 రోజుల వరకూ మ్యాట్రిక్స్ వద్ద ఉంటుంది.మూడు రోజుల తర్వాత ఏదైనా ఫుటేజీ అవసరమైతే కెమెరా ఐపీతో లెటర్ రాసి మ్యాట్రిక్స్ వద్ద నుంచి తీసుకోవాలి. 28 రోజులు దాటితే సీసీ ఫుటేజీ ఉండదు.

హైవేపై.. సేఫ్ వే..

జాతీయ రహదారిపై ఎన్‌హెచ్ఏఐ పరిధిలోని సీసీ కెమెరాల ఫుటేజీ సేఫ్‌వే సంస్థ వద్ద 30 రోజుల వరకూ ఉంటుంది. ఆ గడువు ముగిస్తే ఫుటేజీ దొరకదు. ఏదైనా ప్రమాద ఘటనలు ఉంటే ఆ ఫుటేజీని జాగ్రత్త పరు స్తున్నామని చెబుతున్నారు.ఎంతో ప్రాధాన్యత ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలకు ప్రభుత్వం ఎందుకు సర్వర్లు ఏర్పాటు చేయడం లేదనేది ప్రశ్నగానే మిగులుతోంది.

కేసుల ఛేదనలో బ్రహ్మాస్త్రం..సీసీ కెమెరాలు

- చూస్తున్నాయ్.. కనిపెట్టేస్తున్నాయ్
- అయినా ఏర్పాటులో తీవ్ర నిర్లక్ష్యం
- సర్కారుకు సీసీ కెమెరాలు కరువు
- ఉమ్మడి జిల్లాలో సుమారు 1520
- ఎక్కడికక్కడ పాడైపోతున్న వైనం
- ప్రైవేటు సీసీ కెమెరాలపైనే ఆధారం
- జాతీయ రహదారిలో దారుణం
- జొన్నాడ టూ అన్నవరం 121
- మరిన్ని ఏర్పాటుకు డిమాండ్

హై..వే పట్టదా!

జాతీయ రహదారిపై సీసీ కెమెరాలపై తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. జాతీయ రహదారిపై కిలోమీటరుకు ఒకటి చొప్పున జొన్నాడ నుంచి రాజమహేంద్రవరం వరకూ 49, దివాన్ చెరువు నుంచి-అన్నవరం వరకూ 72 కెమెరాలు ఉన్నాయి. వీటి పర్యవేక్షణ సేఫ్‌వే సంస్థ చూస్తోంది. అయితే హైవే మరమ్మతులు, జొన్నాడ దగ్గర జరుగుతున్న ఫ్లైఓవర్ వంటి పనులు చేస్తున్నప్పుడు వైర్లు తెగిపోవడంతో రోజుల తరబడి సమస్య వస్తోంది. జొన్నాడ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల వల్ల సుమారు 40 కెమెరాలు పని చేయడం లేదు. ఇలాంటి పరిస్థితి వల్ల ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాథమికంగా నిజ నిర్ధారణ అత్యంత కష్టంగా మారుతోంది.

కాకినాడలో సీసీసీ నిరుపయోగం..

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీ నిఘా నేత్రానికి విఘాతం కలిగింది.కాకినాడ స్మార్ట్ సిటీగా ఎంపికైన తర్వాత మొదటిగా కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ)ను తలపెట్టింది. కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రాజెక్టు 2017లో స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిధులు రూ.90 కోట్లతో చేపట్టారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 71 ప్రాంతాల్లో 350 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ బాధ్యతలను సెర్టిలైట్ సంస్థకు 2019లో అప్పగించారు. నెలకు రూ.50 లక్షల చొప్పున ఏడాదికి రూ.ఆరు కోట్లు చొప్పున ఐదేళ్ల పాటు రూ.30 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నారు. మూడేళ్లుగా సంస్థకు చెల్లించాల్సిన రూ.19.50 కోట్ల బిల్లుల బకాయిలు స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ చెల్లించలేదు. నిర్వహణ భారంగా మారడంతో నిర్వాహకులు అగ్రిమెంట్ మధ్యలోనే బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఈ సెంటర్‌లో 35 మంది పనిచేసేవారు. సుమారు రూ.90 కోట్లతో నిర్మించిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నిరుపయోగంగా మారింది. కార్పొరేషన్ అధికారులు కమాండ్ కంట్రోల్ సెంటర్ పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీలు చూశాయ్..పట్టించాయ్..

- రాజమహేంద్రవరంలో వరుస చైన్ స్నాచింగ్‌లతో హడలెత్తించిన దొంగోడి ఆటకు సీసీ కెమెరాలు చెక్ పెట్టాయి. రెండేళ్ల కిందట బొమ్మూరులోని ఇంట్లో నిద్రిస్తున్న ఓ వృద్ధురాలిపై యువకుడు అత్యా చారం చేశాడు.ఈ కేసులో సీసీ కెమెరాలే నేరస్తుడిని కటకటాల్లోకి నెట్టాయి.
- అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో జరిగిన భారీ దోపిడీ కేసును సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సెల్‌ఫోన్ టెక్నాలజీ, సీసీ కెమెరాల ద్వారా గుర్తించి భారీ ఎత్తున రికవరీ చేశారనడానికి ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.
- 2022 నవంబర్‌లో కాకినాడ జిల్లా తునిలో టీడీపీ నాయ కుడు, మాజీ ఎంపీపీ పోల్నాటి శేషగిరిరావుపై కత్తితో దాడి చేసి బైక్‌పై ఉడాయించిన నిందితుడిని ఇంటి వద్ద ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా పట్టుకున్నారు..
- గత వైసీపీ ప్రభుత్వంలో దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని చంపి ఎమ్మెల్సీ అనంతబాబు డోర్ డెలివరీ చేసిన కేసులోనూ సీసీ కెమెరాలే కీలకంగా మారాయి. ఆ హత్యకు ముందు ఆ దళిత యువకుడిని అనంతబాబు ఎలా తీసుకువెళ్లాడో సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. వాటి ఆధారంగా కేసు వెలుగులోకి వచ్చింది.ఇలా ఒకటేమిటి నేరాలకు సంబంధించిన ఏ కేసులోనైనా సీసీ కెమెరాలే కీలకంగా మారాయి.

డీఎస్సీకి.. వేళాయె!



ఈ వారంలోనే నోటిఫికేషన్?

- విద్యాశాఖ సన్నాహాలు
- ఉమ్మడి జిల్లాలో 1278 ఖాళీలు
- నిరుద్యోగుల ఎదురుచూపులు
- ఎస్సీ వర్గీకరణతో నిలుపుదల
- రోస్టర్ పాయింట్లు వస్తే విడుదల

కాకినాడ రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : త్వరలోనే కొలువుల జాతర మొదలు కానుంది. ఈ వారంలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లు రాగానే నోటిఫికేషన్ విడుదల చేయనుంది. వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే దీని కోసం కొన్ని లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ,జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఇచ్చిన ప్రధాన హామీల్లో ఇదొకటి. ప్రస్తుతం దీని అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఇప్పటికే టెట్ పూర్తి

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీని విస్మరించింది.అంతకుముందు ఎన్నికల హామీల్లో ఏటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే ఆ ఊసే మరిచింది. దీంతో నిరుద్యోగ అభ్యర్థులకు ఆ ఐదేళ్లూ ఎదురు చూపులే మిగిలాయి.2024లో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 16,347కుపైగా ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు చేసింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించి ఇప్పటికే ఫలితాలు ప్రకటించింది.

ఉమ్మడి జిల్లాలో ఖాళీలివే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 1,278 ఉపాధ్యాయ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నట్టు సమాచారం. స్కూల్ అసి స్టెంట్లకు సంబంధించి ఆంగ్లం 90, తెలుగు 70, హిందీ 71, గణితం 55, ఫిజికల్ సైన్స్ 59, బయాలాజికల్ సైన్స్ 95, సోషల్ స్టడీస్ 114, సంస్కృతం 5,వ్యాయామ విద్య 199, ఎస్జీటీలు 349, పీజీటీ, టీజీటీ ప్రిన్సిపాల్స్ మొత్తం 171 ఖాళీలు డీఎస్సీ ద్వారా భర్తీ కానున్నట్టు తెలిసింది.మరో వారం రోజుల్లో డీఎస్సీ నోటిఫికేష న్ వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఉ మ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 95 వేల మం దికి పైగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

ఈ ఫలితాలు నవంబరులోనే విడుదల కావడంతో అదే నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని అభ్యర్థులంతా భావించారు. అప్పటికే చాలా మంది అభ్యర్థులు కోచింగ్ తీసుకుంటూ డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కొన్ని సాంకేతిక కారణాలు, ఎమ్మెల్సీ కోడ్ అమలుతో పాటు అభ్యర్థుల వయసు పెంపు తదితర సమస్యలపై స్పష్టమైన నిర్ణయం రావాల్సి ఉన్నందున నోటిఫికేషన్ ప్రకటన వాయిదా పడింది. ఆ సమస్యలన్నింటినీ సరిచేసి కోడ్ ముగిసిన తర్వాత నోటిఫికేషన్ వెలువరిస్తారని ఆశించారు.ప్రస్తుతం నిరుద్యోగులకు మంచి రోజులు వచ్చాయి. తాజాగా సీఎం చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి లోకేశ్ అసెంబ్లీ, శాసన మండలి సమావేశాల్లో ఏప్రిల్‌లోనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. ఆ ప్రక్రియ మొత్తం జూన్ కల్లా పూర్తి చేస్తామని తెలిపారు.ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఆ దిశగా అడుగులు వేస్తుండడంతో అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

వర్గీకరణ పాయింట్లు రాగానే..

ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లు రాగానే నోటిఫికేషన్ విడుదల చేయడానికి విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఆర్డినెన్స్ జారీ కాగానే సాధారణ పరిపాలన శాఖ రిజర్వేషన్లపై కొత్త రోస్టర్ విడుదల చేస్తుంది. దానికి అనుగుణంగా పోస్టులు కేటాయించి, నోటిఫికేషన్ విడుదల చేస్తారు. రోస్టర్ పాయింట్లు విడుదలైన మరుసటి రోజు లేదా ఆ తర్వాత రోజు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలవుతుంది.వర్గీకరణ ప్రక్రియ దాదాపు పూర్తికావడంతో నోటిఫికేషన్‌కు మార్గం సుగమమైంది.

సత్యదేవుడి ఆదాయం రూ.142.89 కోట్లు

గొల్లప్రోలులో ఇద్దరు టీడీపీ కార్యకర్తల అరెస్టు

7

ఘనంగా ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణం

7



ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంవద్ద గరుడ వాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నేటి నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు

- నేడు అంకురార్పణ
- రేపు కల్యాణం, రథోత్సవం

7

ఆరబోత కష్టాలు

- తడిచిన ధాన్యం రాశులు ఆరబెట్టుకునేందుకు రైతుల పాట్లు
- వర్షానికి తడిచిన వరిపనలు
- నేలకొరిగిన వరి పంట
- హడావుడిగా ధాన్యం మిల్లులకు తరలింపు



గొల్లప్రోలు పట్టణ శివారులో వర్షానికి తడిచిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

గొల్లప్రోలు/పిఠాపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): దాళ్వా వరిపంట చేతికందే వేళ రైతులకు కష్టాలు మొదలయ్యాయి. అకాల వర్షాలకు ధాన్యం రాశులు, వరిపనలు తడిచిపోగా వాటిని ఆరబెట్టుకునేందుకు పాట్లు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నేల కొరిగింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం కురిసిన అకాలవర్షం రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది. గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాలతోపాటు ఏలేరు, పీబీసీ ఆయకట్టుప్రాంతంలోను, మెట్ట మండలాల్లో దాళ్వా వరిసాగు చేసిన రైతులు ఆశలు తడిచి ముద్దయ్యాయి. 10వేల ఎకరాల్లో వరిపంట నేలకొరిగింది. ఆరువేల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయిన వరి పంటకు సంబంధించిన ధాన్యం రాశులు కళ్లాలు, ఖాళీ స్థలాలు, రహదారుల వెంబడి ఉండి తడిచిపోగా, సాధారణ పద్ధతుల్లో కోసిన వరి పంటకు సంబంధించి 1700 ఎకరాల్లో వరిపనలు నీటతడిచాయి. కిర్లంపూడిలో 2వేల ఎకరాల్లో, కోటనందూరులోను వందల ఎకరాల్లో పంట నేలనంటింది.

జాగ్రత్తలు తీసుకున్నా..

గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల పరిధిలోని ఖాళీ స్థలాలు, గొల్లప్రోలు, పిఠాపురం, చేబ్రోలు బైపాస్‌రోడ్లు, 216వ జాతీయరహదారి, పిఠాపురం-సామర్లకోట రోడ్డు, చేబ్రోలు-మల్లవరం రోడ్డుతోపాటు ప్రధాన రహదారుల వెంబడి, ఖాళీ స్థలాల్లో ఉన్న ధాన్యం తడవకుండా బరకాలు, టార్పాలిన్లు కప్పినా వర్షపు నీరు రాశుల్లోకి చేరింది. ఆదివారం తెల్లవారుజామునే రైతులు ధాన్యం ఉంచిన ప్రాంతాలకు చేరుకుని అక్కడ నిల్వ ఉంచిన నీటిని తొలగించి ధాన్యం ఆరబెట్టే పనిలో నిమగ్నమయ్యారు. గొల్లప్రోలు, పిఠాపురం శివారుల్లోని ఖాళీ స్థలాలు అన్నింటిలోను ఆరబెట్టిన ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి. మరోవైపు వరిపనలు ఉన్న పొలాల్లో నిలిచిపోయిన నీటిని తొలగించేందుకు వీలుగా రైతులు బాటలు తీస్తున్నారు. వర్షానికి తడిచిన వరి పనలను ఆరబెట్టేందుకు నాలుగు రోజులు సమయం పడుతుందని, దీనివల్ల అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని రైతులు తెలిపారు. ఆదివారం వరకూ ఆరబెట్టిన ధాన్యం రాశులను రైతులు బస్తాల్లోకి నింపి మిల్లులకు తరలించడం కనిపించింది. మరోవైపు కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట పలు ప్రాంతాల్లో నేల కొరిగింది. గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో నేలనంటిన వరి పంట పొలాల్లో నీరు నిలవకుండా రైతులు చర్యలు చేపట్టారు. నేలకొరగడంవల్ల పంటను వరికోత యంత్రాల ద్వారా కోయలేమని, సాధారణ పద్ధతుల్లోనే కోయాల్సి ఉంటుందని రైతులు తెలిపారు.



కిర్లంపూడిలో ఈదురుగాలులకు నేలకొరిగిన వరి పంట

కంటి మీద కునుకు కరవు

దాళ్వా వరి సాగు చేసిన రైతులకు కంటి మీద కునుకు కరువైంది. మరో మూడు నాలుగు రోజులు ఎండతోపాటు వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణశాఖ సమాచారంతో రైతులు కలవరానికి గురవుతున్నారు. పంట కోతకు సిద్ధంగా ఉండడంతో పంట కోయాలా లేదా కొద్ది రోజులు వేచి చూడాలా అనే సందిగ్ధంలో పడ్డారు. పలువురు రైతులు సోమవారం వరికోతయంత్రాల ద్వారా మాసూళ్ల నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు ఆకాశంలో మేఘాలు అలముకుని ఉండడంతో వర్షం పడుతుందేమోనన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

జిల్లాలో 404 మిల్లీమీటర్ల వర్షపాతం

కాకినాడ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్న వేళ.. వరుణుడు కాకినాడ జిల్లా వాసులను పలకరించాడు. శనివారం కురిసిన వర్షంతో కాకినాడ జిల్లాలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అకాలవర్షంతో అన్నదాతలు ఆందోళనలో పడ్డారు. పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. జిల్లాలో మొత్తం 404 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇందులో కోటనందూరులో అత్యధికంగా 46.8 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, తాళ్లరేవు, కాజులూరు, కరప, గండేపల్లిలో 0.0 మి.మీ. నమోదైంది. కాకినాడ రూరల్‌లో 22.6 మి.మీ, కాకినాడ అర్బన్‌లో 10.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. కిర్లంపూడిలో 46.8, ఏలేశ్వరంలో 44.2, ప్రత్తిపాడులో 42.6, రౌతులపూడిలో 41.2, జగ్గంపేటలో 38.4, సామర్లకోటలో 24.8, పిఠాపురంలో 18.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.





గొల్లల మామిడాడలో కోదండరాముడు, సీతాదేవిలకు సమర్పించిన కొబ్బరి బొండాలు... అమ్మవారికి ధరింపజేసే మాంగల్యాన్ని చూపిస్తున్న అర్చకస్వామి

కల్యాణ వైభోగమే



తలంబ్రాలు బియ్యంపై మూడు భాషల్లో రాసిన రామనామం

కనుల పండువగా కోదండరాముని కల్యాణ మహోత్సవం

రామనామస్మరణతో మార్మోగిన గొల్లల మామిడాడ

సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ దంపతులు, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు



శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో కోదండరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు

కాకినాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కోదండ రాముడి కల్యాణ వేడుకతో కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శ్రీరామనవమి పర్వదినాన జరిగిన సీతారాముల కల్యాణోత్సవాన్ని భక్తులు కనులారా వీక్షించారు. ఈ ఊరంతా రామనామస్మరణతో మార్మోగింది. కోరిన కోర్కెలు తీర్చే కోదండరాముడిని భక్తులు భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఆంధ్రా భద్రాద్రిగా పేర్గాంచిన ఈ ఆలయంలో ఆదివారం ఉదయం నుంచే సీతారాముల దర్శనానికి అనుమతిచ్చారు. శనివారం రాత్రికే పెద్ద ఎత్తున భక్తులు మామిడాడ చేరుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం పుష్కరిణి వద్ద ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వివాహం కానివారు స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించి పెళ్లి తలంబ్రాలను శిరస్సుపై ధరించారు. సంతానం లేని దంపతులు స్వామివారిని దర్శించుకుని సంతానప్రాప్తి కలిగించాలని వేడుకున్నారు. స్వామి అనుగ్రహంతో సంతానం కలిగిందని నమ్మిన దంపతులు పుట్టిన పిల్లలను తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ దంపతులు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ద్వారంపూడి వెంకటరెడ్డి మంచి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కాకినాడ ఆర్డీవో మల్లిబాబు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. జి.మామిడాడ గ్రామానికి చెందిన ద్వారంపూడి యువరాజారెడ్డి కొబ్బరి బొండాలు, బియ్యపు గింజలపై మూడు భాషల్లో రాసిన రామనామ తలంబ్రాలను అందజేశారు. చైత్ర శుద్ధ నవమి ఆదివారం ఉదయం 11.30 గంటలకు సీతారాముల విగ్రహాలను కల్యాణ వేదికపైకి వేదపండితులు తీసుకొచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కల్యాణ ఘట్టం ప్రారంభమైంది. జీలకర్ర-బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు క్రతువులను అర్చకస్వాములు శాస్త్రోక్తంగా జరిపించారు. రాష్ట్రం నలుమూలాల నుంచి తరలివచ్చిన భక్తులు కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. పుష్కరిణి వద్ద ఉచితఅన్నదానం నిర్వహించారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న అశేష భక్తజనం



కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

వెంకన్న కల్యాణానికి వేళాయె...

- నేటి నుంచి వాడపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు
- వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా తరలిరానున్న భక్తులు
- రేపు తీర్థం, రథోత్సవం, కల్యాణం



వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దివ్యకల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు చురుకుగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 13 వరకూ నిర్వహించే కల్యాణోత్సవాలకు కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో రెండు దఫాలు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్న దృష్ట్యా భక్తుల సౌకర్యాలపై సమీక్షించి ఆ దిశగా ఏర్పాట్లు చేపట్టాలని అధికార యంత్రాగాన్ని ఆదేశించారు. 7 దశమి సోమవారం స్వామివారి ధ్వజారోహణ, నిత్యబలిహరణ, 8న ఏకాదశి మంగళవారం స్వామివారి తీర్థం, రథోత్సవం, రాత్రి కల్యాణం, 9 ద్వాదశి బుధవారం స్వామివారి పొన్నవాహన మహోత్సవం, 10 త్రయోదశి గురువారం సద్యసం, చతుర్థశి శుక్రవారం గౌతమి గోదావరి నదీలో తెప్పోత్సవం, 12 పౌర్ణమి శనివారం మహా పూర్ణాహుతి, చక్రస్నాన మహోత్సవం, 13 పాడ్యమి ఆదివారం స్వామివారి శ్రీపుష్పయాగముతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి. వైఖానస ఆగమ శాస్త్రప్రకారం ఖండవల్లి రాజేశ్వరప్రసాద్ చార్యులు బ్రహ్మత్వంలో స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు.

వార్షిక ఆదాయం రూ.30 కోట్లు

గతేడాది గ్రేడ్-1 స్థాయి కలిగిన ఈ ఆలయం డీసీ హోదాకు చేరుకుంది. స్వామివారి వార్షిక ఆదాయం రూ.30 కోట్లకు చేరుకుంది. అన్నదాన విరాళాలు రూ.10కోట్లు పైమాటే. దాతల సమకూరుస్తున్న విరాళాలతో పుణ్యక్షేత్రం విరాజిల్లుతుంది.

ఆలయాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల్లోనే పాలకులు ఆలయాభివృద్ధిపై దృష్టిపెట్టారు. రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతోంది. ప్రతి శనివారం 50 వేలకు పైనే భక్తులు తరలివస్తున్నారు. ఆలయ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందించింది. ఆ దిశగా అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. రహదారులు పార్కింగ్ ప్రహరీ, టాయిలెట్లు, సీసీ రోడ్లు, గోశాల నిర్మాణం, తాత్కాలిక అన్నదాన షెడ్‌కు టైల్స్, ఫ్లైఓవర్ తదితర నిర్మాణాలు వేగవంతంగా చేపడుతున్నారు.

స్వామివారి చరిత్ర...

స్వయంభూ ఎర్రచందనమనే కొయ్యవిగ్రహంతో మూర్తిభవించిన పరందాముడు ఈయన. ఇటువంటి విగ్రహం భారత దేశంలో మరెక్కడ లేదు. పూర్వం గౌతమి గోదావరి నదీలో ఓ చందనం పెట్టే లభ్యమైంది. ఋషి పుంగవులతో అలరాలుతున్న ఆ ప్రాంతంలో ఈ చందనం పెట్టే లభించడంతో గ్రామస్తులు ఆ విగ్రహాన్ని మేళతాళ మంగళవాయిద్యాలతో తీసుకొచ్చి ప్రతిష్ఠించిన్నట్టు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుంది. అలనాడు నాటి నౌకపురి పినపోతు గజేంద్రుడు సముద్రంలో తమ ఓడలు కొట్టుకుపోయాయి. ఓడలన్నీ సురక్షితంగా వస్తే ఆలయం నిర్మిస్తామని స్వామివారిని వేడుకున్నారు. ఓడలన్నీ క్షేమంగా ఒడ్డుకు చేరడంతో దేవాలయం నిర్మించినట్టు చరిత్ర చెబుతుంది. అనంతరం స్వామి విశిష్టతను తెలుసుకున్న నాటి సంస్థానదీసులు వత్సవాయి తిమ్మగజపతి మహారాజు స్వామిని దర్శించుకున్నారు. దూపదీప నైవేద్యాల నిమిత్తం 275 ఎకరాలు, స్వామివారి సేవకుల మాన్యాలకు 110 ఎకరాలు భూములు విరాళంగా అందించారు. 7 శనివారాల వెంకన్న దర్శనం 7 జన్మల పుణ్యఫలంగా భక్తులు తరలి వస్తున్నారు.

రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు



ఆలయాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించాం. ఆలయ ఎదురుగా కోనేరు నిర్మాణం, 3 వేలమంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించేలా భవన నిర్మాణం, డార్మేటరి, వసతిగృహాల నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం రూ.10కోట్లతో వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా రూపొందిస్తున్నాం.

\- బండారు సత్యానందరావు, ఎమ్మెల్యే, కొత్తపేట

ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి



జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కల్యాణోత్సవ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాం. చూడచక్కని కల్యాణ వేదిక, భక్తులకు ఎండ వేడి తగలకుండా మజ్జిగ చలివేంద్రాలు, పాలు, బిస్కెట్లు, అన్నసమారాధన చేపడతాం. వివిధ శాఖలకు చెందిన అధికారులు భాగస్వామ్యంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపడుతున్నాం.

\- నల్లం సూర్యచక్రధరరావు, ఉపకమిషనరు, వాడపల్లి దేవస్థానం



స్వామివారి రథానికి మెరుగులు దిద్దుతున్న దృశ్యం

అంగరంగ వైభవంగా...

ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణం





జగన్మోహిని కేశవస్వామి కల్యాణ దృశ్యం, తిలకిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమజిల్లాలో పురాతన ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి దివ్యకల్యాణ మహోత్సవం నవమి ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి మేల్కొపు సేవ, నిరాజన మంత్రపుష్పం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గరుడ వాహన సేవ మేళతాళ మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. వందలాది మంది కేశవదీక్షదారులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సుందరంగా పుష్పాలతో అలంకరించిన కల్యాణ వేదిక వద్దకు స్వామి,అమ్మవార్లను తీసుకువచ్చి కల్యాణ తంతును నిర్వహించారు. వేదపడింతులు ఆగమ శాస్త్ర ప్రకారం శ్రీనివాసుల వెంకటాచార్యులు బ్రహ్మత్వంలో స్వామి వారి దివ్యకల్యాణ మహోత్సవం నిర్వహించారు. అశేష భక్తజనం పాల్గొని భక్తిశ్రద్ధలతో తిలకించారు. పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఆలయ ఈవో బీహెచ్వీరమణమూర్తి దంపతులు స్వామివారికి సమర్పించారు. విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో

సత్యదేవుని ఆదాయం రూ.142.89 కోట్లు

- వ్యయం 147.53 కోట్లు
- రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు.. కానరాని మిగులు

అన్నవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ విభాగాల ద్వారా రూ.142,89,13,196 ఆదాయం సమకూరగా వివిధ పద్దుల కింద రూ.147,53,85,371 వ్యయం చేసినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆదాయ మార్గాల్లో వ్రతం టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.38.39 కోట్లు, ప్రసాదాల విక్రయాల నుంచి రూ.33.06 కోట్లు, భక్తుల హుండీల్లో సమర్పించిన కానుకల నుంచి రు.18.79 కోట్లు, వివిధ షాపుల లైసెన్స్ అద్దెల నుంచి రూ.15.76 కోట్లు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.5.49 కోట్ల ఆదాయం లభించింది. వివిధ పద్దుల ద్వారా వ్యయాన్ని పరిశీలిస్తే ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా ఉంది. దీనికి ప్రధాన కారణం భక్తుల సౌకర్యాలకు రూ.12.74 కోట్లతో పలు నిర్మాణాలు చేపట్టడంతో సుమారు రూ.5 కోట్ల వ్యత్యాసం కనిపించిందన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల జీతాలకు రూ.23.35 కోట్లు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రూ.13.79 కోట్లు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు రూ.8.10 కోట్లు, నాయీ బ్రాహ్మణులు, వ్రత పురోహితులు ఇతరులకు రెమ్యునరేషన్ రూపంలో రూ.15.97 కోట్లు, ఎస్‌పిఎఫ్ భద్రతా సిబ్బందికి, సెక్యూరిటీ గార్డుల జీతాలకు రూ.4.35 కోట్లు, ప్రసాదం తయారీకి ముడిసరుకు కొనుగోలుకు రూ.23.17 కోట్లు వ్యయం చేశారు. రూ.12.74 కోట్లు వివిధ నిర్మాణాలు చేపట్టినందుకు చెల్లింపులు చేశారు. విద్యుత్, వాటర్‌వర్క్స్ సంబంధించి రూ.4.53 కోట్లు వ్యయం చేశారు.

రెజ్లింగ్ చాంపియన్‌షిప్ విజేత 'విజయవాడ'

రన్నర్‌గా కాకినాడ జట్టు



విజేతగా నిలిచిన విజయవాడ జట్టు సభ్యులు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్, ఏపీ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్-2025 ఆదివారం ముగిసింది. విజయవాడ జట్టు విన్నర్‌గా నిల్చి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించిందని చార్టర్ ప్రెసిడెంట్ తీగెల రాజా, ప్రెసిడెంట్ వెంకట్ ఇమ్మాణ్ణి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి దాదాపు 400 మంది క్రీడాకారులు పాల్గొని జాతీయ స్థాయి చాంపియన్ షిప్‌లో అర్హత కోసం పోటీపడ్డారు. కాగా అండర్-20, అండర్-15లో విన్నర్‌గా విజయవాడ పల్నాడు జట్టు నిలిచి ఓవరాల్ చాంపియన్ సాధించింది. రన్నర్‌గా కాకినాడ జట్టు నిలిచింది. విజేతలు ఈ నెల 23న రాజస్థాన్‌లోని కోటాలో జరిగే జాతీయస్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారని తీగెల రాజా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ ముత్యాలు, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ సెక్రటరీ సురేష్ ఉదయగిరి, కార్యక్రమ చైర్మన్ కామేశ్వరీదేవి, స్పోర్ట్స్ చైర్మన్ మద్దూరి శంకర్, ఉపాధ్యక్షుడు ఎం.వెంకన్నబాబు, డైరెక్టర్లు కార్తీక్, వంశీ, శాయమ్, సంతోష్, ఫణీంద్ర పాల్గొన్నారు.

ఇద్దరు టీడీపీ కార్యకర్తల అరెస్టు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటకు చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలను పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. గ్రామంలో రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్సీ నాగబాబు తదితరుల కాన్వాయ్ కంటే ముందుగా వెళ్తున్న తనను శనివారం మధ్యాహ్నం దుర్భాషలాడడంతో పాటు తన మోటార్‌సైకిల్ అద్దాలను చినజగ్గంపేటకు చెందిన శీరం అప్పారావు, మరో వ్యక్తి పగులకొట్టారని వన్నెపూడి గ్రామానికి చెందిన జనసేన నేత మొయిళ్ల నాగబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే సంఘటనకు సంబంధించి జనసేన నాయకుడిని అడ్డుకున్న వారిని నియంత్రిస్తుండగా తన విధులకు ఆటంకం కల్పించారని అప్పారావుతో పాటు రాంబాబుపై పిఠాపురం రూరల్ ఎస్‌ఐ జానీబాషా గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఫిర్యాదులపై వేర్వేరుగా కేసులు నమోదు చేసిన పోలీసులు టీడీపీ కార్యకర్తలు శీరం అప్పారావు, రాంబాబుఅలియాస్‌రామును అరెస్టు చేశారు.

అమలాపురంలో

బాలిక కిడ్నాప్ కలకలం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురం శివారు కొంకాపల్లి ప్రాంతానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికను కారులో వచ్చిన ఐదుగురు వ్యక్తులు కిడ్నాప్ చేసి తీసుకెళ్తుండగా చాకచక్యంగా తప్పించుకుని బయటపడ్డ ఘటనపై అమలాపురం పట్టణ పోలీసులు ఆదివారం రాత్రి దర్యాప్తు చేపట్టారు. కొంకాపల్లికి చెందిన బాలిక మూడో తరగతి చదువుతుంది. ట్యూషన్‌కు వెళ్లి ఆదివారం సాయంత్రం తిరిగి వస్తూ స్థానికంగా ఉన్న గణపతి ఆలయం వద్ద దండం పెట్టుకుంటుండగా కారులో వచ్చిన ఐదుగురు వ్యక్తులు తనను కిడ్నాప్ చేసి తీసుకుపోయారని బాలిక పోలీసులకు వివరించింది. అమలాపురం బస్టాండు సెంటర్‌కు సమీపంలోని శుభకలశం ప్రాంతానికి వచ్చేసరికి కారు డోరు పక్కన ఉన్న వ్యక్తి చెయి కొరికి బయటపడినట్టు చెప్పింది. తండ్రి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తుండడంతో బాలిక డిపోకు చేరుకుంది. అక్కడ తండ్రి గురించి ఆరా తీయగా విశాఖపట్నం డ్రైవర్‌గా వెళ్లినట్టు చెప్పి అతడికి సమాచారం అందించారు. దాంతో హైరానా పడ్డ డ్రైవర్ వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. వారంతా పట్టణ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. బాలికను పట్టణ సీఐ పి.వీరబాబు విచారిస్తున్నారు. ఈ ఘటనపై సీసీ కెమెరాల ద్వారా విచారణ చేస్తామని తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

11న చేబ్రోలులో రాష్ట్రస్థాయి గుర్రాల ప్రదర్శన పోటీలు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి సీతారామస్వామి వారి రాష్ట్ర స్థాయి గుర్రాల పరుగు ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు, నిర్వాహకులు తెలిపారు. చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇంటి పక్కన ఉన్న పుంతరోడ్డులో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. జనసేన చేబ్రోలు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో తొలి పది మంది విజేతలకు నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు. పాల్గొనదలచిన వారు పెద్దింటి శివ (8008599554), ఓరుగంటి వినయ్ (6301010094) లను సంప్రదించాలని సూచించారు.



కాకినాడలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు బిక్కిన

బీజేపీ ఆవిర్భావ వేడుకలు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కార్యాలయంలో 44వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన పార్టీ జెండా ఎగుర వేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ 1980 ఏప్రిల్ 6న బీజేపీని స్థాపించారన్నారు. కార్యక్రమంలో ఎనిమిరెడ్డి మాలకొండయ్య, తుమ్మలపల్లి నారాయణరావు, విశ్వనాథపల్లి శ్రీనివాస్ రాజ్, ఫైడా వెంకటనారాయణ, దిలీప్‌కుమార్, శంకర్ సింగ్, కేంగాం హరిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సౌగంధి కాంప్లెక్సు సెంటర్లో పార్టీ పతకాన్ని బీజేపీ నాయకులు ఎగురవేశారు. మహిళా మోర్చా కార్యకర్తలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు, దాట్ల సూర్యనారాయణరాజు, నాయకులు కంబాల నాగేశ్వరరావు, తోట ఏడుకొండలు, బుర్రి మురళీధరరావు, రామేశ్వరరెడ్డి, రామచంద్రరావు, అడబాల వీరమోహనరావు, పసుపులేటి సత్యనారాయణ, సింహాద్రి, యాళ్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. పట్టణ శాఖ అధ్యక్షుడు చిట్టా మధు, నాయకులు మలిరెడ్డి నారాయణరావు, కర్రి సత్యనారాయణ, చీపూరి భాస్కరరావు, ఆదుమళ్ల కల్యాణ్, దొడ్డిపట్ల జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం, పోలీస్ స్టేషన్, గుర్రాల కూడలిల్లో బీజేపీ పెద్దాపురం నియోజకవర్గ నాయకుడు డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర కార్యకర్తలతో కలిసి పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. భారీ కేక్ కట్ చేసి పలువురికి పంచారు. నాయకులు పుప్పాల నాగగోవిందు, సుంకవిల్లి బాపిరాజు, వల్లూరి బుల్లియ్య, కూనంశెట్టి అర్జునరావు, తుమ్మలపల్లి శివ, చుక్క వెంకటరమణ, అడబాల వీరభద్రరావు, కంచుమర్తి శ్రీను, పాబోలు వీరగణేష్, పుట్టా జోగారావు, దిమ్మల విజయలక్ష్మి, కేశవరపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.రాగంపేటలో బీజేపీ జెండాను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆవిష్కరించారు. పులిమేరులో తుమ్మల పద్మజ జెండా ఎగురవేశారు.





పిఠాపురం, సామర్లకోటల్లో పార్టీ జెండాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

నూకాలమ్మ అమ్మవారికి బంగారు చెవి దుద్దులు బహూకరణ

కాకినాడ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యారావుపేటలో నూకాలమ్మ అమ్మవారికి భక్తుడు మానేపల్లి సత్యనారాయణ రూ.12.50 లక్షలు విలువైన బంగారు చెవి దుద్దులు చేయించాడు. ఆదివారం వీటిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సమక్షంలో సమర్పించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ తలాటం నాని చేయించిన బంగారు హారాన్ని అమ్మవారికి బహూకరించారు. కార్యక్రమంలో ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరి, ఉత్సవ కమిటీ చైర్మన్ తలాటం నాని, సభ్యురాలు దుర్గాభవాని, జనసేన నాయకుడు తలాటం సత్య, టీడీపీ నాయకులు పసుపులేటి వెంకటేశ్వరరావు, బూరయ్య, చెన్నంశెట్టి గోవిందరాజులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బంగారు చెవి దుద్దులు బహూకరిస్తున్న సత్యనారాయణ, ఎమ్మెల్యే కొండబాబు

అనస్థీషియా వైద్య విధానాలపై సీఎంఈ

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ ఎదురుగా ఉన్న ఫార్మకాలజీ విభాగంలో ఆదివారం అనస్థీషియా వైద్య విధానాలపై కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) సదస్సు నిర్వహించారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్, అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ ఎ.విష్ణువర్దన్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు కోయంబత్తూర్ కుప్పై మెడికల్ కాలేజ్ అనస్థీషియా విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్చన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అల్ట్రా సౌండ్ ప్రాధాన్యతను ఆమె దృశ్య రూపంలో వివరించారు. జీఎస్ఎల్ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణప్రసాద్ అల్ట్రా సౌండ్ ద్వారా ట్రంకల్ బ్లాక్స్ క్లియర్ చేసే విధానాన్ని వివరించారు. ఆర్ఎంసీ అనస్థీషియా ప్రొఫెసర్లు డాక్టర్ వింధ్య, డాక్టర్ జి.ప్రసన్న బ్రెయిన్ డెడ్ అంశాన్ని వివరించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అచ్యుతరామయ్య ప్రత్యేక శస్త్ర చికిత్సా విధానాలకు అనుకూలమైన అనస్థీషియాలోని మెళకువలను, ఎదురయ్యే సవాళ్లను విశదీకరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకి చెందిన అనస్థీషియా పీజీ విద్యార్థులతో పాటు ఆర్ఎంసీ అనస్థీషియా విభాగ వైద్యులు పాల్గొన్నారు.



డాక్టర్ అర్చనకు మెమెంటో అందజేస్తున్న అనస్థీషియా వైద్యులు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో అతిథులు

కరాటే బెల్ట్ బెస్ట్ పోటీలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో ఆది వారం ఎస్ఎస్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ బెస్ట్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ బెల్ట్ విభాగాల్లో విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ పోటీలను కరాటే చీఫ్ కోచ్ షిహాన్ ఎల్ సూర్య పర్యవేక్షించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ మాజీ చైర్మన్ యనమదల రవి, పారిశ్రామికవేత్త పెంకే రాజు, అమలాపురం కరాటే కోచ్ పడాల అంజి విజేతలను అభినందించారు.





పిఠాపురం పుల్లయ్య కాలువ వీధి కోదండరామాలయంలో సీతారాముల కల్యాణం, గొల్లప్రోలు విష్ణాలయంలో...

వేడుకగా సీతారాముల కల్యాణం

పిఠాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. పాదగయ క్షేత్రంతో పాటు తహసీల్దారు కార్యాలయ సమీపంలోని పురాతన సీతారామాంజనేయస్వామి ఆలయం, పుల్లయ్యకాలువ వీధిలోని కోదండరామాలయం, చిట్టోడితోటలోని విద్యా గణపతి కోదండరామాలయం, అగ్రహారం, పల్లపు వీధి, గుట్లవీధి, బొజ్జావారితోట, మోహన నగర్, ఏడుకాలువలు, డ్రైవర్స్ కాలనీ, రజక వీధిల్లోని రామాలయాలు, రామకోవెలల్లో సీతారాముల వారిని పెండ్లి కుమార్తె, పెండ్లి కుమారుడిగా అలంకారం చేశారు. ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. చిన్నారులు ఉత్సవమూర్తులతో వీధుల్లో సందడి చేశారు. అనంతరం ఆలయాల్లో వేదపండితులు మంత్రోచ్చారణలతో కల్యాణాలను జరిపించారు. గాలిగంగాలమ్మ గుడి వీధిలో రెండున్నర శతాబ్దాల చరిత్ర కలిగిన రామాలయంలో కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి దేవస్థానం (విష్ణాలయం), చొల్లులదిబ్బ వీధి రామకోవెల, కొత్తపేట రామాలయం, పాపయ్యచావిడి వీధి, కరణంగారితోటల్లోని రామాలయాల్లో వేదపండితులు కల్యాణ క్రతువు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపర్తిలో ఈతతోట, మెయిన్‌రోడ్డు, పల్లపువీధుల్లో గల రామాలయాలు, రామకోవెలల్లో సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. వన్నెపూడి, కొడవలి, దుర్గాడ, ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం గ్రామాల్లోనూ కల్యాణాలు జరిగాయి.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణోత్సవాలను నగరంలో కమనీయంగా నిర్వహించారు. మెయిన్‌రోడ్డులోని సీతారామాలయంలో జరిగిన వేడుకకు వేలాది మంది భక్తులు హాజరయ్యారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో యర్రా వెంకటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. అశోక్‌నగర్‌లో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ దంపతులు కల్యాణోత్సవం నిర్వహించారు. అనేక ఆలయాల వద్ద దాతలు, భక్తుల వితరణతో అన్నదానాలు, పానకం అందజేశారు.

కాకినాడ క్రైం (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ లైన్‌లో ఉన్న రామాలయంలో ఎస్పీ బిందుమాధవ్ దంపతులు పీటలపై కూర్చుని వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. భక్తులకు భారీ ఎత్తున అన్నదానం జరిపారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణాలు వైభవంగా జరిగాయి. పెద్దాపురం మహారాణి సత్రంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి ప్రత్యేక పూజలు చేశారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మఠం సెంటరు వీరభద్ర రామాలయం వద్ద రైతు సంఘం కార్యదర్శి యార్లగడ్డ బాపినీడు-భవాని దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ క్రతువు నిర్వహించారు. సత్యనారాయణపురంలో పెనుముచ్చు సత్యకృష్ణ-రమ్య దంపతులు కల్యాణాన్ని జరిపించారు. అనంతరం కమిటీ ప్రతినిధులు ఏర్పాటుచేసిన మహాన్నదానాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), బీజేపీ నాయకుడు డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర ప్రారంభించారు. కంచి మహా సంస్థానం ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం వద్ద వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి-పద్మ దంపతుల పర్యవేక్షణలో జరిగిన కల్యాణోత్సవంలో విశ్రాంత ఉపాధ్యాయుడు మురళీకృష్ణ దంపతులు ఆసీనులయ్యారు. మఠం సెంటరు శ్రీరామాలయం, సత్యనారాయణపురం కోదండ రామాలయాలను ఎమ్మెల్యే చినరాజప్ప దర్శించి పూజలు చేశారు. వేట్లపాలెం సీతా రామచంద్రస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు చక్రవర్తుల శ్రీపతిఆచార్యులు పర్యవేక్షణలో మణికంఠ ఆచార్యులు వేదమంత్రోచ్చారణలతో కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కరప (ఆంధ్రజ్యోతి): గొర్రిపూడిలో అర్చకుడు విలపర్తి సత్యకృష్ణ, కొత్తలంక గౌరీపతి శాస్త్రి ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. పేపకాయలపాలెం రామాలయంలో స్వామివారి కల్యాణాన్ని జనసేన సీనియర్ నేత బోగిరెడ్డి కొండబాబు దంపతులు జరిపించారు. పెద్దాపురప్పాడు శివారు వైఎస్సావారం రామాలయంలో టీడీపీ నేత వాసిరెడ్డి చిట్టిబాబు సమక్షంలో కల్యాణం జరగ్గా మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెనుగుదురులో ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు సందీప్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి, వైసీపీ నేత కురసాల కన్నబాబు మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, నాయకులు దేవు వెంకన్న, బండారు మురళి, ముద్రగడ రమేష్, బోగిరెడ్డి గంగాధర్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు స్వామివారిని దర్శించుకున్నారు.

కాజులూరు మండలంలోని గ్రామాల్లో సీతారాముల కల్యాణాలను వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఇతర పార్టీల నాయకులు కల్యాణాన్ని వీక్షించి ప్రత్యేక పూజలు చేశారు.





కరప మండలం పెద్దాపురప్పాడు రామాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, సామర్లకోట సత్యనారాయణపురం కోదండ రామాలయంలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే చినరాజప్ప



సంగీత విభావరి

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సంగీత సభాపతి మునుగంటి శ్రీరామ్మూర్తి శత జయంత్యుత్సవాల్లో చివరి రోజు కార్యక్రమాన్ని ఆకొండి శ్రీనివాసరాజరావు అధ్యక్షతన నిర్వహించారు. శ్రీరామ సమాజం ట్రస్టీ మాండలీక రాఘవరావు, భారతలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేశారు. పంతుల రమ, జయంతి సత్యనారాయణశాస్త్రి, భారతలక్ష్మి, పుష్పా రామ్మోహన్, చావలి సూర్యకుమారి, గట్టి శ్రీకృష్ణదేవరాయ, వెంట్రావు, విజయకుమారి తదితర ప్రముఖులు చేసిన సేవలను, గానకళ సంగీత పత్రికను నిర్వహించిన తీరును సామాజిక దృక్పథంతో చక్కగా వివరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పిఠాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య అవసరాల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీ, పి.తిమ్మాపురం, వెల్దుర్తి, జల్లూరు గ్రామాలకు చెందిన నలుగురికి రూ.7లక్షలు మంజూరయ్యాయి. వారికి చెక్కులను మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, మాజీ జడ్పీటీసీ బర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

పెద్దాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ ప్రతీక అని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. కట్టమూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. మేడిది శ్రీనివాస్, రామకృష్ణ, ఏలేటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్ బిల్లును సవాల్ చేస్తాం'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించిన నేపథ్యంలో ఆ బిల్లు రాజ్యాంగ చట్టబద్ధతలు సవాల్ చేస్తూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని కాకినాడ ముస్లిం సమాఖ్య, మేవా, ముస్లిం అడ్వకేట్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్ణయించాయి. స్థానిక మేవా కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం కాకినాడ ముస్లిం సమాఖ్య అధ్యక్షుడు ఎస్.ఎజాజుద్దీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మేవా మాజీ అధ్యక్షుడు ఎండీ జవహర్ ఆలీ, కార్యదర్శి సయ్యద్ సలార్ వక్ఫ్ బిల్లు-2025లో పొందుపరిచిన అంశాలపై చర్చించారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ఉద్యమం చేపట్టాలని సూచించారు. త్వరలో నగరంలోని ముస్లిం యువత, ఉద్యోగులు, మేధావులతో కలిసి జేఏసీ ఏర్పాటు చేసి సంఘాలతో కలిసి చర్చలు జరపాలని, అందరి మద్దతు కూడగట్టాలని నిర్ణయించారు. ముస్లిం నాయకులు గౌస్ మొహిద్దీన్, నవాబ్, అబ్దుల్ బషీరుద్దీన్, షరీఫుద్దీన్, ఫైసల్, ఇమామ్ మొహిద్దీన్, తాజుద్దీన్, రహీం, రహ్మాన్‌ఖాన్, సిరాజుద్దీన్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జవహర్ ఆలీ

ఘనంగా ప్రబోధానంద జయంతి

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంతం ఆధారంగా నూరు గ్రంథాలను రచించిన ఘనత త్రైత సిద్ధాంతకర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులకే దక్కిందని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు పేర్కొన్నారు. ఆదివారం తిమ్మాపురంలో ఆర్ఎంఏ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వింటి వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రబోధానంద జయంతి వేడుకల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయన రచించిన పలు పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ట్రస్టు సభ్యులు సూర్యలక్ష్మి, సుంకర సత్యనారాయణ, ఇమ్మంది చక్రధరరావు, రవిబాబు, సలాది రమేష్, సుంకర సత్యసాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంత పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు

శిల్పారామానికి పోటెత్తిన సందర్శకులు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్ శిల్పారామంలోకి ఆదివారం సందర్శకులు పోటెత్తారు. వాటర్ ల్యాండ్‌లో సేదతీరేందుకు ఆసక్తి చూపించారు. సాయంత్రం కాకినాడకు చెందిన నాట్యవేద కూచిపూడి డాన్స్ అకాడమీ గురువు పద్మావతి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. శిల్పారామంలో సందర్శకులు, చిన్నారుల కోసం ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో ద వాటర్ లాండ్ స్విమ్మింగ్ పూల్, వాటర్స్ గేమ్స్ ఏర్పాటు చేసినట్లు ఎడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మోహన్ తేజ తెలిపారు.



రాములోరి చెంతకు రామచిలుక

పిఠాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిట్టోడితోటలో గల విద్యాగణపతి కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేళ రాములవారి చెంతకు రామచిలుక చేరింది. రామయ్యకు అలంకారం చేస్తుండగా చిలుక వచ్చి విగ్రహంపై ఉండిపోవడాన్ని గమనించిన భక్తులు తన్మయత్వంతో తిలకించారు. కల్యాణం జరుగుతున్నంత సేపూ రామచిలుక అక్కడే ఉంది. 2016లో ఇదే రీతిలో ఇక్కడే సీతారాముల విగ్రహాలపై రామచిలుక ఉండిపోయిన సంగతిని భక్తులు గుర్తు చేసుకున్నారు.



రాత్రివేళ రాములోరి కల్యాణం

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని సీతారామస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణం ఆదివారం రాత్రి కనుల పండువగా జరిగింది. పిఠాపురం మహారాజా కాలం నుంచి వస్తున్న సంప్రదాయానికి అనుగుణంగా రాత్రి 10 గంటలు దాటిన తర్వాత కల్యాణ క్రతువును ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై సీతారాముల ఉత్సవమూర్తులను ఉంచి వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య కల్యాణాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. కాగా ఆలయంలో సంప్రదాయంగా వస్తున్న గంట కొట్టే విషయంలో జనసేనలోని రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదం పోలీసుల జోక్యంతో తాత్కాలికంగా సద్దుమణిగింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ప్రభాకర్ తెలిపారు. పిఠాపురం పట్టణం, కోలంక, జములపల్లి, మాధవపురం, ఇల్లింద్రాడ, నరసింగపురం గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కరెంటు సరఫరా ఉండదని ఆయన వివరించారు.

నేటి నుంచి శృంగార వల్లభస్వామి దివ్య కల్యాణోత్సవాలు



పెద్దాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి ఆరువేల సంవత్సరాల చరిత్ర కలిగిన సింహాచలం కంటే అతిపురాతనమైన స్వయంభు క్షేత్రం. దేశంలో ప్రసిద్ధి చెందిన 108 వైష్ణవ క్షేత్రాల కంటే మిక్కిలి పురాతనమైనది. ఇక్కడ చిరుమందహాస, చిద్విలాస శృంగార వల్లభస్వామి కొలువై వున్నారు. స్వామి దివ్య కల్యాణ మహోత్సవాలను సోమవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

వెలిపై ఫిర్యాదు

అధికారులు పట్టించుకోవట్లేదని బాధితుల ఆవేదన

కరప, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పెద్దలు తమను సంఘం నుంచి బహిష్కరించినట్టు ఫిర్యాదు చేసినా అధికారులెవరూ పట్టించుకోవట్లేదని కాజులూరు మండలం ఆర్యవటం శివారు తుమ్మలపల్లిలంక గ్రామానికి చెందిన తండ్రి, కొడుకులు గీసాల సాయిబాబు, వెంకటరమణ ఆరోపించారు. గ్రామంలో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవలె నిధులు మంజూరుచేసింది. అయితే అదే గ్రామానికి చెందిన ఈశ్వరరావు, మరికొంత మంది రోడ్డు వేయకుండా అడ్డంగా దడులు కట్టి, గ్రామపంచాయతీకి లీగల్ నోటీసులు ఇచ్చి ఆటంకపరిచారని వారు తెలిపారు. గ్రామాభివృద్ధిని అడ్డుకోవడంపై నిలదీయడంతో కక్ష కట్టి తమ కుటుంబాలను గ్రామపెద్దలు సంఘం నుంచి బహిష్కరించినట్టు వారు ఆవేదన చెందారు. శుభ, అశుభ కార్యాలకు పిలవడంలేదని, దేవుడి కార్యక్రమాలకు తమ నుంచి చందాలు వసూలు చేయడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు.దీనిపై ఎస్పీ, ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేయగా ఎస్పీ ఆదేశాల మేరకు గొల్లపాలెం పోలీసులు శనివారం సాయంత్రం ఇరు వర్గాలను కూర్చోబెట్టి మాట్లాడారన్నారు. శ్రీరామనవమి వేడుకను అందరూ కలిసి చేసుకోవాలని చెప్పినా తమను గ్రామ పెద్దలు ఎవరూ పిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమను వెలివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్‌ను వివరణ కోరగా.... ఇరువర్గాలను పిలిచి మాట్లాడామన్నారు. మరోసారి విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆక్వాజోన్ల ఏర్పాటుకు
గ్రామసభలు

జగ్గంపేట రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆక్వా జోన్ల ఏర్పాటుకు ఈ నెల 7నుంచి 9వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు మండల మత్స్యశాఖ సహాయ అధికారి కర్రి రామకృష్ణ తెలిపారు. ఇర్రిపాక, కాట్రావులపల్లి, మామిడాడ, జగ్గంపేట, సీతానగరం, రామవరం, గొల్లలగుంట, మర్రిపాక, గుర్రపాలెం, కాండ్రేగులలో జరుగుతాయని పేర్కొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



జగ్గంపేట: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నెహ్రూ



ప్రత్తిపాడు : ధర్మవరం రామాలయంలో ..



కత్తిపూడిలో స్వామివారి కల్యాణం



తునిరూరల్: తాళ్లూరులో సీతారాముల కల్యాణం



గండేపల్లిలో శ్రీరామనవమి సందర్భంగా కల్యాణం

వైభవంగా శ్రీరామనవమి

● శోభాయాత్రలో పాల్గొన్న హిందువులు
● ఆలయాలకు పోటెత్తిన భక్తులు

జగ్గంపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో పలు కాలనీలో వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. శ్రీరామ్‌నగర్ సీతారాముల ఆలయంలో జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం ప్రధాన కార్యదర్శి బొండాడ జగన్, శ్రావణ లక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామిని దర్శనం చేసుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు పులిహోరా, మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. శెట్టిబలిజ రామాలయం వద్ద దుర్గాప్రసాద్ లక్ష్మి, జియ్యన్న గంగా దంపతులు రూ.50 వేలు విలువైన మంగళసూత్రాలను సీతారాములకు అందజేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) మాధురి ఆండాళ్ దంపతుల కుమారుడు కొత్త యశ్వంత్ దివ్యదంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణం అనంతరం వందలాది భక్తులు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామి వారికి ఏకాదశరుద్రాభిషేకం, పంచోపనిషత్ ద్వారాభిషేకం చేశారు.ప్రతి ఆలయంలోను సీతారామ కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. జగ్గంపేటలోని మెరకవీధి, గద్దపేట, టీచర్స్ కాలనీ, పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీ సువర్చలా సమేత వీరాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ రామాలయాలను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే జ్యోతుల చంటిబాబు సతీమణి వేణు దంపతులు స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు కార్యక్రమాల్లో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పాండ్రం రాంబాబు, రేఖ బుల్లిరాజు, వేములకొండ జోగారావు, మండపాక అప్పన్న దొర,పీలా మహేష్, ఆర్యవైశ్య సేవా సంఘం గౌరవ అధ్యక్షులు బొండా నూకబాబు, సమ్మెట సాయిరాం, వెంట్రప్రగడ రంగబాబు, మానేపల్లి వీర్రాజుగుప్తాం, కంచర్ల శ్రీనుబాబు, జగ్గంపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పాలకుర్తి సురేష్, సత్యదేవ నర్సింగ్ హోం అధినేత డాక్టర్ బచ్చు ప్రసాద్,కొత్తభైరవ కృష్ణ దంపతులు, కొత్త శ్రీరామకృష్ణ దంపతులు పాల్గొన్నారు. జగ్గంపేటలోని సోమాలమ్మ తల్లి ఆలయం వద్ద నుంచి శోభయాత్ర నిర్వహించారు. గ్రామంలో ఉన్న అన్ని రామాలయాల మీదుగా ఈ శోభయాత్ర జరిగింది. ముఖ్య అతిథిగా భారతీయ ధర్మ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి పొడుగు వెం కట సత్యనారాయణ ప్రసాద్ ఆచార్యులు విచ్చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో రామభక్తులు పాల్గొని రామాలయాలను దర్శించుకున్నారు.

ఏలేశ్వరం: మండలంలోని రామాలయాల వద్ద వైభవంగా శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో కొలువైన సీతారాములకు కళ్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు సత్యనారాయణ, బుజ్జి నేతృత్వంలో స్వామి వారిక ప్రత్యేక పూజలు చేయగా కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, హైమావతి దంపతులు పీఠలపై కూర్చుని కళ్యాణం జరిపారు. స్వామి అమ్మవార్లకు పట్టణ టీడీపీ అధ్యక్షులు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు పానకం, ప్రసాదాలు అందజేశారు. యర్రవరం అంజనేయస్వామి ఆలయం నుంచి హిందూ బంధువులు మోటార్‌సైకిళ్లపై శోభాయాత్ర నిర్వహించారు. వాగు రాజేష్, పైల విజయ్‌కుమార్, సామంతుల గోపి, బుగతా శ్రీను, గోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్గంపేట రూరల్: మండలంలోని ఇర్రిపాక రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి జ్యోతుల మణి దంపతులు కల్యాణం వీక్షించి స్వామి,అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాముల వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దేశాన్ని, ఆంధ్ర రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం పరిపాలిస్తుందన్నారు. ప్రతి పేదవారికి సంక్షేమం అభివృద్ధి అంది స్తూ రామ రాజ్యాన్ని స్థాపించడానికి కృషి చేస్తామన్నారు. ఎంతం సత్యనారాయణ, జ్యోతుల సత్యమూర్తి, అడపా తాతాజీ భక్తులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో పెద్దిరెడ్డి సురేష్ నాగమణి దంపతులతో వేద పండితులు సీతారాములకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రమణానందస్వామి పాల్గొన్నారు. ధర్మవరంలోని నంది సెంటర్, పద్మశాలి రామాలయం వద్ద ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పూజలు నిర్వహించారు. పల్లపు వీధి రామాలయం వద్దపుణ్యమంతుల రవి దంపతులు పూజలు నిర్వహించగా బొల్లువారి రామాలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు.

శంఖవరం: మండలంలోని ఎస్.జగ్గంపేట, శంఖవరం, కత్తిపూడి, వజ్రకూటం, తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి. కత్తిపూడిలో కేశంగి హరినాద్ రఘువాణి దంపదులు పీటలపై కూర్చుని స్వామివారి కళ్యాణాన్ని సుందరంగా జరిపించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

తొండంగి: ఏవీ నగరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని ఆలయంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీరామ నవమి సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి అర్చకులు వెంకన్న, మిశ్రా కల్యాణ క్రతువుకు శ్రీకారం చుట్టారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. యనమల నాగేశ్వరావు, మురళి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కిర్లంపూడి: జగనతిపగరంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రాములోరి కల్యాణోత్సవానికి హాజరయ్యారు. ముక్కొల్లులో ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబు దంపతులు రాములోరి కల్యాణానిన్న అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, తోట వరహాలయ్య, భూపలపట్నం ప్రసాద్, జ్యోతుల రాంబాబు, కర్రి రాజా తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజుపాలెం పెరికల రామాలయం వద్ద ఆలయ ధర్మకర్తలు పల్లా రాజారావు, మాజీ ఎంపీటీసీ గొడే దొరబాబు, గొడే ఏసుబాబు ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు.

రౌతులపూడి: మండల గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మూలగపూడిలో రాముల వారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. పలు ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కోటనందూరు: జగన్నాథపురంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కళ్యాణాన్ని జరిపించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తలకించారు.

తుని రూరల్: శ్రీరామనవమి వేడుకలను తుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. తాళ్లూరులో మాజీ ఎంపీటీసీ ఆవుగడ్డి వెంకటరమణ దంపతులు స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

గండేపల్లి: గండేపల్లిలో ఎస్‌ఐ శివనాగబాబు దంపతులు పీటలపై కూర్చుని రాములోరి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి దర్శించుకుని కల్యాణం తిలకించారు.

కనుల పండువగా రత్నగిరి రామయ్య కల్యాణం



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్

అన్నవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అన్నవరం ఆలయ క్షేత్రపాలకులైన సీతారాముల కల్యాణం ఆదివారం భక్తజనుల జైశ్రీరామ్ నినాదాల నడుమ కనుల పండువగా జరిగింది. ఉదయం తొమ్మిది గంటలకు వార్షిక కల్యాణ వేదిక వద్ద వెండి సింహాసనంపై నవ దంపతులైన సీతారాములను, మరో వేదికపై పెండ్లి పెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను ఆశీనులు గావించారు. ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో పండితులు కల్యాణ తంతుకు శ్రీకారం చుట్టారు. గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం కన్యావరుణ జరిపారు. సీతారాముల వంశవృక్షాన్ని వివరించే ప్రవరను పండితులు పఠించారు. ద్విజత్వాన్ని ప్రసాదించే సువర్ణ యజ్ఞోపవీతాన్ని రాముల వారికి మంత్ర పూర్వకంగా అలంకరింపజేశారు. పవిత్ర జలాలతో పాదప్రక్షాళన అనంతరం మధుపర్కప్రాశన జరిపి మధుపర్కాలను నవదంపతులకు అలంకరించారు. సుముహూర్త వేళ జీలకర్ర-బెల్లం మిశ్రమాన్ని స్వామి, అమ్మవార్ల శిరస్సులపై భక్తుల గోవిందనామస్మరణ మధ్య మాంగల్యం తంతునానేనా లోకరక్షణ హేతునా అంటూ పండితులు మంత్రాలు పఠిస్తుండగా సీతమ్మ మెడలో రామయ్య మూడుముళ్లు వేశారు. దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, చైర్మన్ రోహిత్ పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణ తంతును కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి, అంగర సతీష్ నిర్వహించారు. చతుర్వే పండితుల వేదాశీర్వచనాల అనంతరం కల్యాణం అక్షింతలు, పానకం, వడపప్పు ప్రసాదంగా భక్తులకు అందజేశారు.

హైవేకు సుమాల సోయగం



కత్తిపూడి జాతీయరహదారిపై ఆకర్షణీయంగా ఉన్న పూల చెట్లు

శంఖవరం, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగుతుంటే హైవేకు ఇరువైపులా లేతగులాబీ రంగు పులిమినట్లు ఉంటుంది. ఈ దారిలో వెళ్లే ప్రతీ వాహన చోదకుడి దృష్టిని ఈ అద్భుతం ఆకర్షిస్తుంది. పూలరేకులు పుష్పగుచ్ఛాల్లా గాలికి రాలుతూ భలే గమ్మత్తైన అనుభూతి ఉంటుంది. వసంత అందాలను ఆరబోసే ఈ దృశ్యం కాకినాడ జిల్లా కత్తిపూడి హైవేలో కనిపిస్తుంది. హైవే విస్తరణ తర్వాత తరాల నాటి చెట్లు దూరమవగా అందం కోసం నాటిన చెట్లు తరువులై అక్కడక్కడా ఇలా చూడముచ్చటగా తయారయ్యాయి. టాబెబుయా రోసియా అనే ఈబసంత్ రాణీ చెట్లు వంద అడుగుల ఎత్తులోనే ఉంటాయి. రాజమహేంద్రవరం నుంచి వస్తుంటే హైవే ఫ్లైవరు వంతెన ఎక్కేటప్పుడు చక్కగా సాగనంపుతాయి.

కల్యాణోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

అన్నవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో స్వామి వారి వార్షిక కల్యాణోత్సవ పోస్టర్‌ను ఆదివారం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆవిష్కరించారు. వచ్చేనెల 7న ప్రారంభమై 13తో ముగియనుండగా కల్యాణం మే 8న జరగనుంది. ఇదిలా ఉండగా సత్యదేవుడి వార్షిక కల్యాణానికి వినియోగించేందుకు గాజువాకకు చెందిన గుంటపల్లి ప్రసాద్ అర కిలో మంచిముత్యాలను ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాతను ఈవో అభినందించారు. ప్రధానార్చకులు సుబ్రహ్మణ్యశర్మ, ఏఈవో కొండలరావు, పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకలు



సిరిపురంలో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న కొల్లా శ్రీనివాస్ తదితరులు

ఏలేశ్వరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండలంలోని సిరిపురం, యర్రవరం గ్రామాల్లో బీజేపీ జెండాను ఎగురవేశారు. మాజీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీని స్థాపించిన శ్యాంప్రసాద్ ముఖర్జీ, వాజపేయి, అద్వానీ తదితర నాయకులను ఆదర్శంగా తీసుకొని పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. వెలుగూరి హరేరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడి, ధర్మవరం గ్రామాల్లో బీజేపీ మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ప్రత్తిపాడులో సింగిలిదేవ్ సత్తిరాజు జెండా ఆవిష్కరించారు. లంపకలోవ, వేములపాలెం, ఉత్తరకంచి,బవురువాక పోతులూరు గ్రామాల్లో చిలుకూరి రామ్‌కుమార్‌తో పాటు బీజేపీ మండలాధ్యక్షుడు ఊటా వీరబాబు ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కర్రి ధర్మరాజు, సారిపల్లి శ్రీనివాస్, గొనగాని గోపిరాజు, డొడ్డిపట్ల సుబ్బరావు, గొనగాని వీరబాబు, గొన్నాబత్తుల రాజబాబు, ఇంటి వీరనాగేశ్వరరావు, తేజోమూర్తుల సుధారాణి, రాజా కింగ్‌బాబు రాజు పాల్గొన్నారు.

రౌతులపూడి: మూలపూడిలో బీజేపీ మండలాధ్యక్షుడు లగడు శ్రీనివాసరావు అధ్యక్షతన పార్టీ కార్యక్రమానికి పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జెండాను ఆవిష్కరించారు. బీజేపీతోనే దేశాభివృద్ధి జరుగుతుందని, అందుకు ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో మానివెల్లి రమణ, తండపురెడ్డి మాణిక్యం, దాసరి వీరబాబు, కోరుప్రోలు ఏసుబాబు, యెనుముల రాజా పాల్గొన్నారు.

జె.అన్నవరంలో ఎక్సైజ్ దాడులు



జె. అన్నవరంలో దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది

ప్రత్తిపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది ఆదివారం జె.అన్నవరం గ్రామంలో సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సీఐ టి.శివప్రసాద్, ఎస్‌ఐ వంశీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 10న వేలం నిర్వహించనున్నట్టు తెలిపారు.

వేమవరంలో రాష్ట్ర స్థాయి
ఎడ్ల పరుగు పోటీలు



వేమవరంలో జరుగుతున్న ఎడ్ల పోటీలు

తొండంగి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం వేమవరంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందెం పోటీలను నిర్వహించారు. పంపాదమ్మ ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆలయ సమీప రోడ్డులో పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి జూనియర్, సీనియర్ విభాగాల్లో 32 జతల ఎడ్లు పాల్గొన్నాయి. సీనియర్ విభాగంలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరుకు చెందిన కోరా తేజచౌదరి జత ప్రథమ స్థానాన్ని, కాకినాడ జిల్లా కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ జత ద్వితీయ స్థానాన్ని, ధర్మవరం గ్రామానికి చెందిన జువ్వల సత్తిబాబు ఎడ్లజత తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. జూనియర్ విభాగంలో వరుసగా వెల్దుర్తికి చెందిన మొగిలి ఏసుబాబు, కడియం మండలం దుళ్లకు చెందిన తూము శ్రీను, కొప్పవరం గ్రామానికి చెందిన బండారు శ్రీను జతలు మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. మరో రెండు బహుమతులు కూడా నిర్వాహకులు ప్రకటించారు. విజేతలకు బహుమతులు అందించారు.

అకాల వర్షం.. పంటలకు నష్టం



కోటనందూరు : అల్లిపూడిలో నేలకొరిగిన వరి చేను

కోటనందూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు రబీ పంట నేలకొరిగింది. కాకరాపల్లి, అల్లిపూడి, కొట్టాం, తదితర గ్రామాల్లో వందల ఎకరాల్లో అపారనష్టం వాటిల్లింది. పంటచేతికి వచ్చే సమయంలో ఇలా జరగడంతో భారీగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారంతా కోరుతున్నారు.

కిర్లంపూడి: ఈదురు గాలుల బీభత్సం .. అకాల వర్షంతో నేలనంటిన వరి పంటలు... అకాల వర్షాలు రైతులను కంటతడి పెట్టిస్తున్నాయి. శనివారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రాష్ట్రంలోనే అధికంగా కురిసింది. మండలంలో చిన్న, సన్నకారు రైతులు వరి పొలం చేస్తున్నారు. పొట్ట దశలో ఉన్న వరి పొలాలు మండలంలో 2వేల ఎకరాలకు పైగా నేలకొరిగాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఒక్కొక్క ఎకరానికి 30 వేలకు పైగా దుక్కు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలకు అప్పు చేసి దాళ్వా వరి పంటలకు పెట్టుబడులు పెట్టినట్టు వాపోతున్నారు. అలాగే చిల్లంగి గ్రామంలో చింతలతోటలో కొబ్బరిచెట్టు పడి ఒక సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమైంది. అలాగే రొయ్యల చెరువులకు వెళ్లే దారిలో తాడిచెట్టు పడి విద్యుత్ వైర్లు ధ్వంసమయ్యాయి. కిర్లంపూడి కొమరివీధిలో పొలాల్లోకి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో సుమారు రూ. 5 లక్షల నష్టం వాటిల్లినట్టు ఏఈ గంగమ్మ తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

అంగరంగ వైభవంగా
రాములోరి కల్యాణం



చింతూరులో కోదండరాముని కల్యాణం



వీఆర్‌పురంలో స్వామివారికి పూజలు

చింతూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణాన్ని ఆదివారం చింతూరు కోదండ రామాలయంలో వైభవంగా జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి తిలంకించారు. ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం కోదండ రామాలయంలో సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహిం చారు. ప్రధాన అర్చకుడు పవన్ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు దంపతులు, సూపరింటిండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు దంపతులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ దంపతులు, ఏడీఈ కొండబాబు దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొని కల్యాణం నిర్వహించారు. లోయర్ సీలేరు ఏపీ జెన్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమవరపు బాలకృష్ణ, ఏడీఈ కొండబాబు దగ్గరుండి చూసుకున్నారు. సర్పంచ్ ఆకేటి సీత,ఆలయ కమిటీ సభ్యులు శర్మ, కొట్టు శ్రీనివాసరావు, నరసింహమూర్తి రత్నాకర్ మూర్తి, చంద్రశేఖర్, కాంట్రాక్ట్ కార్మికులు, లోయర్ సీలేరు ఏపీజెన్‌కో ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

వీఆర్‌పురం: మండలంలో రెండో భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీరామగిరిలోని కొండపై కొలువైన శ్రీసుందర సీతారామస్వామివారి తిరు కల్యాణ మహోత్సవం ఆదివారం వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణతంతును ఆలయ ప్రధానార్చకుడు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు ప్రారంభించారు. ముందుగా ప్రభుత్వం తరపున చింతూరు ఐటీడీఏ పీవో పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ప్రధానార్చకులకు అందచేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మాజీ సభ్యుడు వి.గాంధీబాబు, ఆలయ చైర్మన్ పెందుర్తి సుదర్శన్, జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్, టీడీపీ నాయకులు గొంది చంద్రయ్య, ఆచంటి శ్రీను, ముత్యాల చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, ముత్యాల రమేష్, జనసేన మండలాధ్యక్షుడు ములకల సాయికృష్ణ, బాగుల అంజి తదితరులు పాల్గొన్నారు. వీఆర్‌పురం, చింతూరు, ఎటపాక మండలాల పోలీస్ స్టేషన్ల సిబ్బంది వచ్చారు. రంపచోడవరం ఓఎస్‌డీ జగదీష్ అడవల్లి, చింతూరు సీఐ దుర్గాప్రసాద్, ఎటపాక సీఐ కన్నపు రాజు, వీఆర్‌పురం, కూనవరం ఎస్‌ఐలు సంతోష్ కుమార్, ఎల్ లతాశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎటపాక: శ్రీరామనవమిని మండలంలోని పలు రామాలయాల్లో సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధానంగా సీతాపురం, నెల్లిపాక, పురుషోత్తపట్నం గ్రామాల్లోని ఆలయాల్లో కల్యాణాలు జరిపించారు. అనంతరం అన్నదానం, పానకా ల పంపిణీ జరిగింది. ఎటపాకలోని శ్రీ అభ యాంజనేయ స్వామి ఆలయంలో పులిహోర, పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామస్తులు పాటి చలపతి, బాచినేని శ్రీకాంత్, సంపత్ పాల్గొన్నారు.

రంపచోడవరం: శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని ఏజెన్సీ గ్రామాల్లో సీతారామ కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయంలో అర్చకులు సూర్య సాయి కిరణ్, వేద పండితు లు ఇంద్రగంటి పవన్‌శర్మ ఆధ్వర్యంలో సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, ధార్మిక సంస్థలు విశ్వహిందూపరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, సమరత సేవా ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు, ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయకర్త నల్లమిల్లి వెంకటరామారెడ్డి పాల్గొన్నారు. వాల్మీకి పేటలో మాజీ సర్పంచ్ వై.నిరంజనీ దేవి ఆధ్వర్యంలో సీతారామకల్యాణ మహోత్స వం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షిం విగ్రహం వద్ద భక్తులకు పానకం అందజేశారు. వై.భూచక్రం, గొర్లె రమాదేవి, దాసరి అయ్యప్ప, దాసరి సుబ్రమణ్యం, గొర్లె భావాని శంకర్, శ్రీరామ్ చందు వాల్మీకి, రమ్యకాంతి, జి.స్యనారాయణ, వై.చిన్నారావు, ఉలవల మణికంఠ, చిన్నం హేమన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

వై.రామవరం: శ్రీరామనవమి పురస్కరించుకుని ఆదివారం మండలంలోని పలుచోట్ల వేడుకలు ఘనంగా జరిపారు. వై.రామవరంలో వాల్మీకి వీధిలోని రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని జరిపారు. స్థానిక బస్ సెంటర్ వద్ద ఉన్న రామాయలంలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పి.యర్రగొండలో రాముల వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. యార్లగడ్డ, పనసలపాలెం, చవిటిదిబ్బలు, దాలిపాడు తదితర గ్రామాల్లో భక్తులు పానకాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు.

రాజవొమ్మంగి: కమ్మరపేటలో కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు సందర్భంగా సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహిం చారు. కమ్మరిపేటకు చెందిన మిరియాల అప్ప న్నబాబు, వెంకటలక్ష్మి దంపతులు చేతుల మీదుగా కల్యాణం నిర్వహించారు.



నెల్లిపాకలో కల్యాణాన్ని జరిపిస్తున్న దృశ్యం



రాజవొమ్మంగిలో ...

వై.రామవరం ఎంపీడీవోగా బాపన్నదొర బాధ్యతలు

వై.రామవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం ఎంపీడీవోగా కె.బాపన్నదొర బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన ఎంపీడీవో రవికిషోర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో మండల పరిషత్ పరిపాలన అధికారిగా పనిచేస్తున్న బాపన్నదొర జడ్పీ సీఈవో ఉత్తర్వుల మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధుల్లో చేరారు.. దీనిపై ఎంపీడీవో బాపన్నదొరను వివరణ అడగ్గా ఈనెల 4న రవికిషోర్ దీర్ఘకాలిక సెలవు పెట్టినట్లు తెలిపారు.

500 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం స్వాధీనం చేసుకున్న దృశ్యం

రాజవొమ్మంగి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలించేందుకు ఒక ఇంట్లో నిల్వ ఉంచిన 500 కిలోల రేషన్ బియ్యాన్ని ముందస్తు సమాచారం మేరకు బియ్యాన్ని స్వాధీన చేసుకున్నామని రాజవొమ్మంగి తహశీల్దార్ అల్లు సత్యనారాయణ తెలిపారు. స్థానిక రాజవొమ్మంగి గాంధీ బొమ్మ సెంటర్ సమీపంలో గల నూకాలమ్మ గుడి వీధిలోని ముసలిబాబు ఇంటిలో ఇదే గ్రామానికి చెందిన పండూరి అప్పారావు అనే వ్యక్తి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 11 బస్తాలు 500 కిలోల రేషన్ బియ్యం నిల్వ ఉంచారంటూ రెవెన్యు అధికారులకు వచ్చిన సమాచారం మేరకు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట వీఆర్వో సూర్యకాంతం, సిబ్బంది ఉన్నారు.

తమిళనాడుకు 16 అడుగుల రథం తరలింపు

ఎటపాక, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని పాత పాళయం కోదండ రామాలయానికి అల్లూరి జిల్లా ఎటపాక మండలం గన్నవరం గ్రామం నుంచి 16 అడుగుల రథం సిద్ధం చేసి తరలించారు. శ్రీరామనవమి సందర్భంగా అక్కడి ఆలయ నిర్వాహకులు ఆదివారం ఇక్కడికి వచ్చి టేకుతో తయారీ చేసిన రథాన్ని ప్రత్యేక వాహనంలో తమిళనాడు తీసుకెళ్లారు. గన్నవరం గ్రామానికి చెందిన కార్పెంటర్ చీరాల వీరయ్య తోటి ఐదుగురు కార్పెంటర్లతో కలిసి నెలరోజుల పాటు శ్రమించి ఈ రథాన్ని తయారు చేశారు. రథం తయారీకి రూ. నాలుగు లక్షల వ్యయం ఖర్చు అయిందని వీరయ్య తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా సాయంత్రం 5-30 గంటల మూహార్తంలో రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమిళనాడుకు తరలించారు.